RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 291 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 27-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥


VOLUME: 18 | ISSUE : 291 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 27-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి..

# వైసీపీ డ్రామాలను నమ్మొద్దు

- రాయదుర్గం నియోజకవర్గం కనేకల్ మండలం నల్లంపల్లిలో కార్యకర్తల సమావేశం
- హాజరైన టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్
- కూటమిలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామని హామీ
- పులివెందుల ప్రజల కోసమైనా జగన్ అసెంబ్లీకి రావాలని సవాల్



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేయాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని కనేకల్ మండలం నల్లంపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**కార్యకర్తలే పార్టీకి బలం.. మీ ఫీడ్‌బ్యాక్‌కు విలువ**

"ఈ రోజు మేము మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా మీ ముందు నిలబడ్డామంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలు, శ్రమే. ముఖ్యంగా 2019–24 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వ దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను ఎదుర్కొని కూడా పసుపు జెండాను దించకుండా పోరాడిన మీరే పార్టీకి అసలైన బలం. అందుకే టీడీపీలో కార్యకర్తే అధినేత" అని లోకేశ్ అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం దేశంలో ఏ పార్టీ చేయని విధంగా బీమా సౌకర్యం కల్పించి, ఇప్పటివరకు రూ. 160 కోట్లు ఖర్చు చేశామన్నారు. యువగళం పాదయాత్రలో కార్యకర్తలు కోరినట్లే, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకు 'మైటీడీపీ' యాప్‌ను తీసుకొచ్చామని తెలిపారు. "మీరు తరువాయి 2లో..

## సీజేపీ నిరసనల తర్వాత.. ఇన్‌స్టాలో పెరిగిన మోదీ, రాహుల్ క్రేజ్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దిల్లీలో ఇటీవల జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన అనంతరం జెన్‌జీకి దగ్గరకావడానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పలు వీడియోలు షేర్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడిన వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. పలువురు కేంద్రమంత్రులు కూడా యువతతో మమేకమవ్వడానికి ఆసక్తి చూపించారు. దీని ఫలితం ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించినట్లు తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఒక్కసారిగా నది ఉప్పొంగడంతో సంభవించిన మెరుపు వరదలు నేపాల్‌ను అతలాకుతలం చేశాయి. ఈ ప్రకృతి విపత్తులో 384 మంది పర్యాట కులు గల్లంతయ్యారని నేపాల్ టూరిజం బోర్డ్ వెల్లడిం చింది. వీరిలో 291 మంది విదేశీయలు కాగా.. అందులో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. మరో 37 మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. గల్లంతయిన వారిలో 93 మంది నేపాల్ జాతీయులు ఉన్నారు. ప్రభావిత ప్రాం తంలోని ట్రావెల్ ఏజెన్సీలు ఇచ్చిన లెక్కల ఆధా రంగా ప్రాథమికంగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. భోటెకోశీ నది బుధవారం ఉదయం ఉద్ధృతంగా ప్ర వహించింది. నదిలో ప్రవాహం తరువాయి 2లో..

## ఏపీలో కీలక రహదారికి కేంద్రం నిధులు మంజూరు..


- గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపిన చంద్రబాబు
- ఎన్డీఏ డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వంతోనే అభివృద్ధి అన్న సీఎం చంద్రబాబు
- ఏపీలో జాతీయ రహదారికి రూ. 840 కోట్లు మంజూరు చేసిన కేంద్రం
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపిన ముఖ్యమంత్రి
- పోలవరం, గోదావరి ఘాట్లకు మెరుగుపడనున్న కనెక్టివిటీ
- రైతులు, భక్తులకు లబ్ధి చేకూరుస్తుందని హర్షం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వ యంతో ముందుకు సాగుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొ న్నారు. రాష్ట్రంలోని కీలకమైన జాతీయ తరువాయి 2లో..



## గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యం




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. వీరు తరువాయి 2లో..

## ఇమ్రాన్‌ఖాన్ ఇక జైలు నుంచి ప్రాణాలతో బయటపడకపోవచ్చు..!



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై ఆయన కుమారులు ఖాసీం, సులేమాన్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. తన తండ్రికి ప్రైవేటు ఆసుప్రతిలో చికిత్స అందించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాక్ ప్రభుత్వం విస్మరించిందని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తూనే ఉందని, జైలు నుంచి ఆయన ప్రాణాలతో బయటపడకపోవచ్చని మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. "మా తండ్రి దాదాపు మూడు సంవత్సరాలుగా నిర్బంధంలో ఉంటున్నారు. ఫలితంగా ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన జైలులో ఎక్కువకాలం జీవించలేరని అనిపిస్తోంది. మా నాన్న ఉంటున్న జైలు చాలా ఇరుకుగా తరువాయి 2లో..

## పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద..

# 48 గేట్లు ఎత్తివేత

- రెండు, మూడు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు
- పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యామ్ వద్ద
- 30.30 మీటర్లకు చేరుకున్న గోదావరి నీటిమట్టం
- 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

గత రెండు, మూడు రోజులుగా తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాలలో పడుతున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద నీరు పోటెత్తుతుంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం తీవ్రతరమైంది. ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్ వే వద్ద నీటిమట్టం 30.20 మీటర్లుగా నమోదైంది. వరద నీటిని క్రమబద్ధీక రించేందుకు తరువాయి 2లో..



## 'భారత్ ధర్మశాల కాదు'

### 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్

- 2047 అభివృద్ధి లక్ష్యానికి అంతర్గత భద్రత కీలకమని అమిత్ షా వ్యాఖ్య
- చొరబాట్లు, ఉగ్రవాదం, డ్రగ్స్‌పై ముందస్తు చర్యలకు పిలుపు
- అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తం చేయడమే లక్ష్యమని వెల్లడి
- 'భారత్ ధర్మశాల కాదు' అంటూ అక్రమ వలసదారులపై తీవ్ర వ్యాఖ్యలు
- కొత్త క్రిమినల్ చట్టాల పూర్తి అమలుకు ఏడాది గడువు లక్ష్యం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి పటిష్ఠ అంతర్గత భద్రతే పునాది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో 'జాతీయ భద్రతా సదస్సు' ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ముప్పు రాకముందే చర్యలు**

మరో 15 నుంచి తరువాయి 2లో..



## ఎడిటోరియల్

# మోడీ మంత్రులకు ఏజ్ దెబ్బ !

నరేంద్ర మోడీ కేబినెట్ విస్తరణ తొందరలో జరుగుతుంది అని అంటున్నారు. నిజానికి ఈ తరహా వార్తలు గత మూడు నాలుగు నెలలుగా జాతీయ ప్రాంతీయ మీడియాలో సోషల్ మీడియాలో తరచూ వినిపిస్తున్నా ఆ శుభ ముహూర్తం మాత్రం ముంచుకుని రావడం లేదు. అయితే ఈసారి మాత్రం విస్తరణ జరగడం తధ్యమని అంటున్నారు. దానికి అనేక కారణాలు ఉన్నాయి. మంత్రులు కొందరి మీద విపరీతమైన పని భారం పడుతోంది. ఏకంగా 14 మంది మంత్రులు ఒకటికి మించిన మంత్రిత్వ శాఖలతో తలమునుకలు అవుతున్నారు. దాంతో వారి శాఖలను వేరే వారికి ఇవ్వాల్సి ఉంది. అలాగే బీజేపీ జాతీయ కార్యవర్గంలో కొందరు చేరారు. దాంతో వారి పదవులు కూడా కొత్త వారికి ఇవ్వాలి. కొందరు మంత్రుల రాజ్యసభ పదవీ కాలం తొందరలో ముగుస్తోంది. దాంతో వారిని సైతం తప్పించడం అనివార్యం. ఇక అన్నింటికంటే పనితీరు విషయంలో కొందరు వెనకబడి ఉన్నారు దాంతో వారికి ఉద్వాసన ఖాయంగా ఉంది. వీటికి మించి మరో ఆసక్తి కరమైన విషయం ఏమిటి అంటే మోడీ కేబినెట్ లో వయో వృద్ధులు ఎక్కువ అయ్యారు అన్నది. దాంతో వారిని తప్పనిసరిగా తప్పించేస్తారు అని టాక్ అయితే ఢిల్లీ రాజకీయ వర్గాలలో జోరుగా నడుస్తోంది. ఈ రోజుకు చూస్తే మోడీ కేబినెట్ లో అత్యంత వృద్ధుడు 81 ఏళ్ళ జితన్ రాం మాంజీ. ఈయన కొద్ది కాలం పాటు బీహార్ ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఈయనకు సొంతంగా పార్టీ ఉంది. ఆయనే ఏకైక ఎంపీ కూడా అంటారు. మరి ఆయన్ని తప్పిస్తే మిత్ర పక్షానికి బెర్త్ ఇవ్వరా అన్న చర్చ వస్తోంది. అయినా సరే వయసు మీరితే పదవి కట్ అన్న రూల్ ని జితన్ రాం మాంజీతోనే అమలు చేయడం మొదలెడతారు అని అంటున్నారు. అదే విధంగా మోడీ మంత్రి వర్గంలో డెబ్బై ఏళ్ళు దాటిన వారు ఏకంగా 12 మంది ఉన్నారని అంటున్నారు. వీరిని కూడా ఏజ్ ఫ్యాక్టర్ అన్న కారణంతో పక్కన పెట్టే అవకాశాలు అయితే పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు. జెన్ జీ యూత్ ని ఆకట్టుకోవడం వేగంగా ప్రభుత్వం స్పందించడం అదే విధంగా కేబినెట్ కి యూత్ అట్రాక్షన్ తీసుకుని రావడం ఫ్రెష్ నెస్ ఉండేలా చూసుకోవడం ఈసారి మంత్రి వర్గ విస్తరణలో ఇవే ప్రధాన అంశాలు కాబోతున్నాయని అంటున్నారు. దాంతో చాలా మందికి ఏజ్ దెబ్బ పడుతుందని కూడా ఊహాగానాలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. అదే సమయంలో మోడీ కేబినెట్ కూర్పులో ఈసారి రెండు వర్గాలకే ఎక్కువగా ప్రయారిటీ లభిస్తుంది అని అంటున్నారు. అందులో ఒకటి యువత. రెండు మహిళ అని అంటున్నారు. జెన్ జీ యాక్టివ్ గా దేశంలో ఉండటంతో వారికి దగ్గర కావడానికి యువ మంత్రులను మోడీ ఎక్కువగా ముందుకు తెస్తారు అని అంటున్నారు. అందులో రాజకీయంగా కొత్త అయినా జూనియర్లు అయినా ఫరవాలేదని కూడా నిర్ణయించారని అంటున్నారు. అలాగే మహిళా మంత్రుల సంఖ్య కూడా గణనీయంగా పెంచాలని అనుకుంటున్నారని భోగట్టా. ఇక్కడా కొత్తగా గెలిచిన వారు తొలిసారి పార్లమెంట్ కి వచ్చిన వారిని సైతం అదృష్టం వరించే చాన్స్ ఉందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే మోడీ కేబినెట్ లో ఈసారి అనూహ్యమైన కొత్త ముఖాలు కనిపిస్తాయని అంటున్నారు. సో ఎవరా లక్కీ మినిస్టర్లు అంటే వెయిట్ అండ్ సీ.

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతను కాపాడండి..

# వైసీపీ డ్రామాలను నమ్మొద్దు

పాల్గొనే ప్రతి కార్యక్రమం, మీరు ఇచ్చే ఫీడ్‌బ్యాక్ నేరుగా మాకు చేరుతుంది. కొత్త పెన్షన్లు, ఇళ్ల మంజూరు వంటివి కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే ప్రభుత్వ దృష్టికి తీసుకెళుతున్నాం. కష్టపడే కార్యకర్తను మేమే వెతుక్కుంటూ వస్తాం. ఎక్కడైనా సమస్య పరిష్కారం కాకపోతే, మీకు అండగా నేనుంటాను" అని హామీ ఇచ్చారు.

**అనంతపురం అభివృద్ధి నా బాధ్యత**

ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీకి కంచుకోట అని, తమ కుటుంబాన్ని ఎల్లప్పుడూ ఆదరించిందని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "ఎన్టీఆర్‌ను, హరిమామను, మా బాల మావయ్యను గెలిపించిన గడ్డ ఇది. ఈ అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటాను. అనంతపురం జిల్లా అభివృద్ధి నా బాధ్యత" అని స్పష్టం చేశారు. సోలార్, విండ్ ఎనర్జీ, ఫైటర్ జెట్ తయారీ సంస్థ వంటి పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఉరవకొండలో తయారయ్యే విండ్‌మిల్‌పై 'మేడ్ ఇన్ ఉరవకొండ' అని మంత్రి కేశవ్ సంకల్పం పెట్టుకున్నారని, ఇదే స్ఫూర్తితో ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల అభివృద్ధికి పోటీ పడాలని సూచించారు. ఈ సందర్భంగా, కనేకల్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**గొడ్డలి పార్టీవి డ్రామాలే.. అసెంబ్లీకి రా జగన్!**

వైసీపీపై లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "గొడ్డలి పార్టీతో మనం రాజకీయంగా పోరాడుతున్నాం. సొంత బాబాయ్‌ని హత్య చేసి, ఆ నిందను ఇతరులపై వేయడం వారి నైజం. కోడికత్తి, గులకరాయి డ్రామాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ఇప్పుడు లిక్కర్ స్కామ్‌లో వారి మాజీ మంత్రిని ఈడీ అరెస్ట్ చేస్తే, దానికి కూడా మమ్మల్ని నిందిస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌కు ఆయన సవాల్ విసిరారు. "డీఎస్సీ, ఏపీపీఎస్సీకి తేడా తెలియని జగన్, డీఎస్సీపై చర్చకు సిద్ధమా? టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చెయ్. ప్రెస్‌మీట్లు కాదు, దమ్ముంటే అసెంబ్లీకి రా. పులివెందుల ప్రజలు నిన్ను గెలిపించింది వారి సమస్యలు సభలో ప్రస్తావించడానికే. కానీ రెండేళ్లలో ఒక్కసారి ప్రమాణ స్వీకారానికి వచ్చి వెళ్లిపోయావు. పులివెందుల ప్రజల కోసమైనా అసెంబ్లీకి రా" అని లోకేశ్ సవాలు చేశారు.

**కూటమి ఐక్యతను కాపాడాలి**

కూటమిలో చిచ్చు పెట్టేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. "జనసేన, బీజేపీ పేరుతో టీడీపీని తిడుతూ సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెడుతున్నారు. వాటిని నమ్మి ఆవేశపడొద్దు. మనమంతా ఐక్యంగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి వేగంగా సాధ్యమవుతుంది" అని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా, సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నామని, ఇప్పటికే 16 వేల టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేపాల్‌లో మెరుపు వరదలు.. 105 మంది భారతీయుల గల్లంతు

ఆకస్మికంగా పెరగడంతో రసువా జిల్లాలోని పలు గ్రామాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని నేపాల్ ఆర్మీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇళ్లు, ప్రాజెక్టు కేంద్రాలు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు 16 మంది ప్రాణాలు కోల్పోయారు. 41 మంది భద్రతా సిబ్బంది గల్లంతయ్యారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. నేపాల్ ప్రభుత్వం అత్యవసర సహాయక చర్యలు చేపడుతోంది. అయితే పర్వత ప్రాంతాలు కావడంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి.

**బిహార్, ఉత్తరప్రదేశ్‌కు అడ్వైజరీలు..**

నేపాల్‌కు సరిహద్దులో ఉన్న బిహార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు కేంద్రం అడ్వైజరీలు జారీ చేసింది. గండక్ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి నిశితంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించింది. ప్రకృతి విపత్తు ప్రభావం చైనాను తాకింది. టిబెట్‌లోని చైనా-నేపాల్ సరిహద్దులో కొండచరియలు విరిగిపడటంతో ప్రాణనష్టం సంభవించింది. నివాస ప్రాంతాలకు నష్టం వాటిల్లింది. దీంతో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పూర్తిస్థాయి సహాయక చర్యలకు ఆదేశించారు. మరోవైపు, మెరుపు వరదలకు సంబంధించి ముందస్తు వార్నింగ్ ఇవ్వడంలో చైనా విఫలమైందనే ఆరోపణలు నేపాల్‌లో వినిపిస్తున్నాయి.

# ఏపీలో కీలక రహదారికి కేంద్రం నిధులు మంజూరు..

రహదారి అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీఏ డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం, మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధిని అందిస్తోందని చంద్రబాబు కొనియాడారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి-365దీదీ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.840.41 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కేంద్రమంత్రి గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా పోలవరం ప్రాజెక్టుకు రవాణా సౌకర్యం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల పొగాకు, చెరకు, పామాయిల్, ఆక్వా రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లకు వేగంగా తరలించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బుట్టాయిగూడెం--ఎల్ఎన్‌డీ పేట, పత్తిసీమ--కొవ్వూరు మధ్య 45.09 కిలోమీటర్ల మేర రహదారిని పేవ్డ్ షోల్డర్స్‌తో రెండు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య వాణిజ్య సంబంధాలు బలపడతాయని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం లభిస్తుందని సీఎం చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నాటికి భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ రహదారి నిర్మాణం దోహదపడుతుందని తెలిపారు. కేంద్రమంత్రి గడ్కరీ తన ప్రకటనలో, ఈ రహదారి విస్తరణతో పోలవరం ప్రాజెక్టుతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. వ్యవసాయపరంగా కీలకమైన ఈ ప్రాంతంలో ఉత్పత్తుల రవాణా వేగవంతం కావడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా, గోదావరి నది వెంబడి ఉన్న పుణ్యక్షేత్రాలకు, స్నానఘట్టాలకు భక్తులు సులభంగా చేరుకునేందుకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ ప్రాజెక్టుతో ఈ ప్రాంతంలో వ్యవసాయం, పర్యాటకం, వాణిజ్యం, తీర్థయాత్రలతో పాటు సామాజిక-ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు అవుతుందని కేంద్రం భావిస్తోంది.

# 'భారత్ ధర్మశాల కాదు'

## 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్

20 ఏళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు.

**'ఇది ధర్మశాల కాదు'**

సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు. "ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంది" అని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు.

**3 ఏళ్లలో కేసుల పరిష్కారమే లక్ష్యం**

కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షా చెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు.

**ఉగ్రవాదం, డ్రగ్స్‌పై ఉక్కుపాదం**

పీఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్ర-రాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేసేందుకు 'ప్రహార్' వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలపై 'డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్' విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. 2026-29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

**ఏఐతో కొత్త భద్రతా కవచం**

సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని యువ అధికారులకు సూచించారు.

## మొదటి పేజీ తరువాయి

### సీజేపీ నిరసనల తర్వాత..

# ఇన్‌స్టాలో పెరిగిన మోదీ, రాహుల్ క్రేజ్

'డేటా బిగిన్స్' అనే సంస్థ నివేదికలు వెల్లడించాయి. ఈ సమయంలో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీల ఇన్‌స్టా ఎంగేజ్‌మెంట్ రేట్స్ భారీగా పెరిగినట్లు తెలిపాయి. నిరసనలకు ముందు.. జులై 20 తర్వాత గణాంకాలను క్రోడీకరించి ఈ డేటాను వెలువరించాయి. నివేదికల ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ ఎంగేజ్‌మెంట్ రేట్ (అత్యధిక వ్యూస్, లైక్స్, షేర్స్, కామెంట్స్) 289.9శాతం పెరిగింది. ఆయన తర్వాతి స్థానంలో 180.7శాతంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలిచారు. నిర్ణీత సమయంలో వీరు వరుసగా వీడియోలు షేర్ చేయడంతో అగ్ర నేతల ఖాతాలకు ఆదరణ బాగా పెరిగినట్లు తెలుస్తోంది. వీరితో పాటు వీరి పార్టీ ఖాతాల వ్యూస్ సైతం పెరగడం గమనార్హం. ఈ నిర్ణీత కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ ఖాతాను ఎక్కువ మంది వీక్షించారు. దీంతో ఆయన ఒక్కో పోస్టుకు ఎంగేజ్‌మెంట్ 1,190,000 నుంచి 4,630,000లకు పెరిగింది. మునుపటి స్థాయి కంటే ఇది దాదాపు 3.9 రెట్లు ఎక్కువ. రాహుల్ గాంధీ ఖాతా వీక్షణల్లోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఆయన సగటు ఎంగేజ్‌మెంట్ 1,52,000 నుంచి 4,26,000లకు పెరిగింది. యువతను ఆకట్టుకోవడానికి, రాజకీయ దృష్టిని ఆకర్షించడానికి ఇన్‌స్టాగ్రామ్ ప్రధాన సోషల్ మీడియా వేదికగా కొనసాగుతోంది.

# గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యం

పశ్చిమబెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు రమణారావు తెలిపారు. అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు ఈనెల 3న వేటకు వెళ్లారు. ఆ తర్వాత వారి ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఈనెల 17 నుంచి 10 రోజుల పాటు నేవీ, కోస్ట్‌గార్డ్, మెరైన్ సిబ్బంది విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మత్స్యకారుల బోటు ఆచూకీని కోల్‌కతా సమీపంలో గుర్తించినట్లు రమణారావు తెలిపారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకొస్తున్నట్లు చెప్పారు. మత్సకారులు సురక్షితమని సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఇమ్రాన్‌ఖాన్ ఇక జైలు నుంచి ప్రాణాలతో బయటపడకపోవచ్చు..!

ఉంది. దానికి ఒక కిటికీ అంటూ లేకపోవడంతో గాలివెలుతురు రావు. రోజంతా ఆ గదిలోనే బంధించి ఉంచుతున్నారు. గత అక్టోబర్‌లో కంటిచూపు మందగించినప్పుడు.. మూడు నెలలపాటు చుక్కల మందు ఇచ్చారు. ఫిబ్రవరిలో పరీక్షలు చేయగా.. కుడి కంటి చూపు దాదాపుగా మసకబారిందని తెలిసింది" అని ఖాసీం ఆరోపణలు చేశారు. తన తండ్రిని సంప్రదించడం తమకు అసలు వీలు కావడం లేదని మరో కుమారుడు సులేమాన్ మీడియాకు వెల్లడించారు. తాను, తన సోదరుడు సంవత్సరాలుగా తండ్రిని కలుసుకోలేకపోయామని, తమ వీసా అభ్యర్థన ముందుకుసాగడం లేదని వెల్లడించారు. అంతకుముందు ఫోన్‌లో మాట్లాడేవాళ్లమని, ఆ కాల్స్‌పైనా నిఘా పెట్టారని ఆరోపణలు చేశారు. గత ఆరునెలల్లో తాము ఒక్కసారి కూడా ఫోన్ మాట్లాడలేకపోయామని వాపోయారు. తమ తండ్రి ( (×ఎత్ఖఅ ఖష్ఘుఅ) హక్కులు ఉల్లంఘనకు గురవుతున్నాయని విమర్శించారు. తన తండ్రి ఎదుర్కొంటోన్న ఏకపక్ష నిర్బంధంలో సైనిక వ్యవస్థ ప్రమేయం ఉందని తాము భావిస్తున్నట్లు చెప్పారు. ఇమ్రాన్ ఖాన్‌కు మానవతా దృక్పథంతో చికిత్స అందించాలని, సరైన వైద్య సదుపాయాలు కల్పించాలని పలువురు మాజీ క్రికెటర్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌నకు లేఖరాసిన సంగతి తెలిసిందే. వీరిలో భారత్‌కు చెందిన దిగ్గజ ఆటగాళ్లు సునీల్ గావస్కర్, కపిల్ దేవ్, దిలీప్ వెంగ్‌సర్కార్ ఉన్నారు.

# పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత

అధికారులు స్పిల్ వేకు చెందిన 48 గేట్లను ఎత్తివేసి, దిగువకు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరద ప్రభావంతో దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరుకోవడంతో అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# అధికారుల అండతో జీవీఎంసీ 4వ వార్డులో నీటి మాఫియా

## అధికారులకు ముడుపులు అందుతున్నాయి అని స్థానిక ప్రజలు ఆరోపణ







**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగష్టు 26:**

వర్షాలు లేక జీవీఎంసీ పరిధిలో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇలాంటి సమయంలో జీవీఎంసీ 4వ వార్డులో నీటి మాఫియా విచ్చలవిడిగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తిమ్మాపురం రోడ్డు, విజ్ఞాన్ స్కూల్ వద్ద, కాపులప్పాడ పరిధిలో అక్రమంగా అనేక బోర్లు వేసి భూగర్భ జలాలను తోడి ట్యాంకర్ల ద్వారా ఆక్వా హేచరీలు, ప్రైవేటు విద్యాసంస్థలకు విక్రయిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనుమతులు లేని బోర్లకు కూడా కరెంటు కనెక్షన్లు ఇచ్చారని, అధికారులు నీటి మాఫియా యజమానులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు పేపర్లలో కథనాలు వచ్చినా, వినతి పత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.దీనివల్ల చుట్టుపక్కల ఇళ్లలో నీటి కొరత ఏర్పడి, రాబోయే రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి అక్రమ బోర్లను, నీటి వ్యాపారాన్ని అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం మే దీనికి కారణం అని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటి అయ్యిన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి అని కోరుతున్నారు.

## పద్మనాభం కేజీబీవీ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్



**పద్మనాభం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

పూసపాటి అలక నారాయణ గజపతి రాజు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మాన్సాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్-కమ్-మీన్స్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. విశాఖపట్నం జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డా. జె. చంద్రశేఖర్ గారి సహకారం, మార్గదర్శకత్వంతో ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల ప్రయోజనం కోసం ముందుకు తీసుకువచ్చినట్లు కేజీబీవీ పద్మనాభం ప్రిన్సిపాల్ కె. గ్రేస్ లిల్లీ తెలిపారు. కేజీబీవీ పద్మనాభం నుంచి గాజ మరియు ఇంటర్మీడియట్‌కు చెందిన 18 మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున స్కాలర్‌షిప్ పొందారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించే ఈ కార్యక్రమం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాన్ని ప్రారంభించిన మాన్సాస్ ట్రస్ట్ మరియు డా. జె. చంద్రశేఖర్ ,ప్రిన్సిపాల్ కె. గ్రేస్ లిల్లీ, సిబ్బంది, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రోత్సాహం విద్యార్థుల్లో మరింత పట్టుదలతో చదివి ఉన్నత విజయాలు సాధించాలనే స్ఫూర్తిని కలిగిస్తుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

### చిన్నారులతో ముచ్చటించి సందడి చేసిన సీఐ శ్రీనివాస్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 26**

నగరంలోని అరిలోవ పరిధిలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తఫా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు చేపట్టారు. కార్లు, బైక్‌లతో ముస్లిం యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని ఘనంగా కొనసాగించారు. ఆకుపచ్చని ఇస్లామిక్ జెండాలతో పాటు భారత జాతీయ త్రివర్ణ పతాకాలను చేతబూని, దరూద్ పాక్ పఠిస్తూ ముందుకు సాగారు. దేశభక్తి, మత సామరస్యం ప్రతిబింబించేలా సాగిన ఈ ర్యాలీ స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో స్థానిక అరిలోవ సీఐ శ్రీనివాస్ పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న చిన్నారులను ఎత్తుకుని, వారితో సరదాగా ముచ్చటిస్తూ ఆప్యాయతను చాటుకున్నారు. సీఐ చిన్నారులతో గడిపిన ఆత్మీయ దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## వేములవలసలో మదర్ థెరిసా విగ్రహావిష్కరణ

**ఆనందపురం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 26:**

ప్రపంచ ప్రఖ్యాత మానవతామూర్తి, భారతరత్న మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని ఆనందపురం మండలం వేములవలసలో ఆమె విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ అర్జున మాట్లాడుతూ.. నిస్వార్థ సేవలకు మారుపేరైన మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు ప్రజాసేవ చేయడం అభినందనీయమన్నారు. సమాజంలో నిరుపేదలకు, బాధితులకు అండగా నిలిచే సేవాభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ రమ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ లూథర్ బాబు, ఎస్బీఐ రిటైర్డ్ అధికారి భూపతిరావు, పోర్ట్ అథారిటీ ప్రతినిధి వెంకట్, న్యాయవాదులు కేపీ దేశాయ్, కేఎస్ఎం సుధాకర్ పాల్గొన్నారు. అలాగే ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, జోనల్ కార్యదర్శి చిరంజీవి, గౌరవ అధ్యక్షులు తిరుపతిరావు, జోనల్ సలహాదారు కోన ప్రకాశ్, అల్లాడ త్రినాథరావుతో పాటు మహిళా ప్రతినిధులు రోజా, భవాని, కౌసల్య, పద్మ, సరస్వతి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భూదాన్ భూముల సమగ్ర సర్వే చేసి కబ్జాకోరుల భరతం పట్టండి


### -సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ శంకర్ నాయక్




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో ఆగస్ట్ 26**

తెలంగాణ రాష్ట్రంలో భూదాన భూములు కాపాడుటకు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సర్వే చేసి భూములను ఆక్రమించి అన్యాక్రాంతం చేస్తున్న కబ్జాకోరుల భరతం పట్టాలని,చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సంగారెడ్డి జిల్లా సర్వోదయ మండల్ జిల్లా సమావేశం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఉప్పరి రవీందర్ అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సర్వోదయ మండల రాష్ట్ర అధ్యక్షులు ఆర్ శంకర్ నాయక్ అన్నారు. వినో బాబావే పేద ప్రజల కోసం 14 సంవత్సరాలు దేశవ్యాప్తంగా పాదయాత్ర చేసి దానంగా స్వీకరించిన భూదాన భూములను పేద ప్రజలకు చెందకుండా ఆయన ఆశయాలను నీరుగారిస్తున్నారు. లక్షల కోట్ల విలువైన భూములను భూ బకాసురులు ఆక్రమిస్తున్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు భూదాన భూముల విషయంలో వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలోనే మొట్టమొదటిగా దానంగా స్వీకరించిన చరిత్ర ఈ రాష్ట్రానికి ఉందని అటువంటి రాష్ట్రంలో ఈ విధంగా జరగడం దారుణమని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై గిరిప్రసాద్ మాట్లాడుతూ అన్ని జిల్లాలలో సర్వోదయ మండల్ కమిటీలు ఏర్పాటు చేసి వినోద్ బాబాయ్ ఒక రక్త బొట్టు చిందకుండా లక్షల ఎకరాలు సేకరించి దాన్ని కాపాడుటకు వినోబాభావే నామిని అయిన సర్వ సేవా సంఘం సలహాతో భూదాన్ యజ్ఞ బోర్డ్ ఏర్పాటు చేయాలని ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లా సర్వోదయ మండల్ జిల్లా కమిటీని ఎన్నిక చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా ఎన్ రాజు ముదిరాజ్, జిల్లా ప్రతినిధిగా డాక్టర్ కిషన్, జిల్లా కార్యదర్శిగా ఎస్.కె గంగారం, జిల్లా ఉపాధ్యక్షులుగా గోపాల్, ఎం భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

## ఆనందపురం పరిధిలో నేడు విద్యుత్ నిలిపివేత



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

33/11 కేవీ ఆనందపురం విద్యుత్ ఉపకేంద్రం నుంచి మండల కేంద్ర ఫీడర్, శొంఠ్యం ఉపకేంద్రానికి సంబంధించిన జి.ఎస్.అగ్రహారం లైన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు ఆపరేషన్ జోన్-3 కార్యనిర్వాహక ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం (ఆగస్టు 27) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో ఆనందపురం, బి.పి.కల్లాలు, ఎస్సీ--బీసీ కాలనీ, సుఖీభవ లేఅవుట్, మామిడిలోవ, జి.ఎస్.అగ్రహారం, గండిగుండెం, రామవరం గ్రామాల్లో గృహ, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

## అంతర్జాతీయ గోల్ షాట్‌బాల్ పోటీలకు విద్యార్థిని పూజిత ఎంపిక

**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 26**



చదువుతో పాటు క్రీడారంగంలోనూ విశేష ప్రతిభ కనబరుస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. ఆనందపురం మండలం వెల్లంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తాతపూడి పూజిత అంతర్జాతీయ క్రీడా వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. అండర్-16 విభాగం గోల్ షాట్‌బాల్ భారత జట్టుకు ఎంపికైన ఆమె, పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే భూటాన్ చేరుకుంది. ఈ నెల 27న భూటాన్ వేదికగా ప్రారంభం కానున్న అంతర్జాతీయ గోల్ షాట్‌బాల్ టోర్నమెంట్‌లో శ్రీలంకతో సహా పలు దేశాల క్రీడాకారులతో పూజిత తలపడనుంది. పాఠశాలలో తరగతి టాపర్‌గా నిలుస్తూ విద్యాభ్యాసంలో ముందంజలో ఉన్న పూజిత, క్రీడల్లోనూ నిరంతర సాధనతో జాతీయ స్థాయిని అధిగమించి అంతర్జాతీయ వేదికకు ఎంపికవడంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. చదువును, క్రీడలను సమన్వయం చేసుకుంటూ పాఠశాలతో పాటు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన పూజితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాడిశెట్టి రమేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు తోనంగి సరిత, ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. రాబోయే పోటీల్లో పూజిత ఉత్తమ ప్రతిభ కనబరచి దేశానికి విజయాన్ని అందించాలని వారు ఆకాంక్షించారు.

## మూడు రాజధానుల ఉద్యమం వెనుక చంద్రబాబు, లోకేష్ హస్తం

### తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ధ్వజం

### విశాఖ ఎయిర్‌పోర్ట్ కార్మికుల నిరసనపై తప్పుడు ప్రచారం మానుకోవాలని హితవు



**విశాఖపట్నం (సిటిజన్ టైమ్స్ )ఆగష్టు 26**

గతంలో రాష్ట్రంలో జరిగిన మూడు రాజధానుల ఉద్యమం వెనుక తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఉన్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. విశాఖపట్నంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో మాదిగాని గురునాథం చేత 1374 రోజుల పాటు ఉద్యమం చేయించిందే చంద్రబాబు, లోకేష్ అని విమర్శించారు. నాడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ ఉద్యమాన్ని నడిపించారని ఆరోపించిన టీడీపీ నేతలు, నేడు అదే గురునాథంతో కలిసి ఎందుకు తిరుగుతున్నారో సమాధానం చెప్పాలని, వారితో దిగిన ఫోటోలు నిజం కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఈ వాస్తవాన్ని టీడీపీ నేతలు కాదనగలరా అని ఆయన నిలదీశారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్ కార్మికులు తమ హక్కులు, న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం స్వచ్ఛందంగా ఆందోళన చేస్తుంటే, ఆ నిరసనల వెనుక వైఎస్సార్‌సీపీ ఉందంటూ టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని బి.వి.రామ్ మండిపడ్డారు. కార్మికుల న్యాయపోరాటానికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదని, ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. తెలుగు శక్తి ఏ రాజకీయ ప్రయోజనాల కోసమో పనిచేయడం లేదని, ప్రజల సమస్యలపై స్పందించే వేదికగా, కుటుంబ సభ్యుడిలా బాధితులకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా కార్మికుల హక్కులను కాపాడటానికి బాధ్యతగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఎయిర్‌పోర్టులో 170 మంది కార్మికులు రోడ్డున పడితే ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఎయిర్‌పోర్టును డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుగా కొనసాగిస్తూ ఉదయం మూడు గంటలు, సాయంత్రం మూడు గంటల పాటు విమాన సర్వీసులు నడపాలని, ఇది ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్ష అని పేర్కొన్నారు. విశాఖ ఆత్మగౌరవాన్ని, తెలుగు జాతి గౌరవాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, గత 50 ఏళ్లుగా ఎయిర్‌పోర్టు సేవలు వినియోగించుకున్న నగర ప్రజలు ప్రతి కుటుంబం నుంచి ఒక్కరైనా ఈ నెల 27న తరలివచ్చి కార్మికులకు మద్దతుగా నిలవాలని బి.వి.రామ్ పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

# చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకే టైక్వాండో శిక్షణ

### ఘనంగా జీవీఎంసీ వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు

### 70 మంది చిన్నారులకు ప్రశంసాపత్రాలు, టీ-షర్టుల పంపిణీ







**విశాఖపట్నం, ఆగష్టు 26 (సిటిజన్ టైమ్స్)**

విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్‌పై ఆసక్తి పెంచుకుంటే మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం రెండూ పెంపొందుతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఆధ్వర్యంలో బాబా టైక్వాండో అకాడమీ సహకారంతో నిర్వహించిన వేసవి క్రీడా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో దాదాపు 70 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని టైక్వాండో మెళకువలపై ప్రత్యేక శిక్షణ పొందారు. కార్యక్రమ ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు మాజీ కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ, 12వ వార్డు అధ్యక్షుడు ఓమ్మి అప్పలరాజు, 13వ వార్డు అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి ప్రోత్రకొండ ధర్మారావు, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, టైక్వాండో కోచ్ ఆలీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, టీ-షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో శారీరక దృఢత్వానికి, ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి



**అమరావతి: (సిటిజన్ టైమ్స్); ఆగస్టు: 26**

కోదాడ వద్ద ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మొత్తం ఆరుగురు మృతి చెందగా, నలుగురు ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన వారు ఉన్నారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రిఆకాంక్షించారు.

## రాష్ట్రంలో కరువుతాండవిస్తోంది




**తాడేపల్లి: (సిటిజన్ టైమ్స్); ఆగస్టు: 26**

రాష్ట్రంలో కరువు తాండవిస్తోందని, దీన్ని ప్రభుత్వం గుర్తించడం లేదని వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు నాయుడు కుంభకర్ణుడిలా నిద్రపోతున్నారని అన్నారు. జూన్ నుంచి ఇప్పటివరకు 52 శాతం లోటు వర్షపాతం నమోదు అయిందని, ఇలాంటి పరిస్థితులను కూటమినేతలు ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. వారి మాటలు నమ్మి పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు జగన్ పేర్కొన్నారు.

## వర్షానికి తడవని ఇంటర్ మెమో

### కొత్త తరహా ధ్రువపత్రాల్లో 25 రకాల భద్రతా ఫీచర్లు

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 26**

ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇక వర్షానికి తడవని, చిరిగిపోని కొత్త తరహా ధ్రువపత్రాలను అందజేస్తున్నారు. మందమైన, నాణ్యమైన చిరిగిపోని ప్రత్యేక కాగితంపై ఈ సర్టిఫికెట్లను ముద్రిస్తున్నారు. వర్షానికి తడవకుండా, త్వరగా పాడవకుండా ఉండే విధంగా వీటిని తయారు చేశారు. ధ్రువపత్రాల్లో ఏకంగా 25 రకాల భద్రతా లక్షణాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ ఈ తరహా కొత్త సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ వెల్లడించారు. విద్యార్థుల సర్టిఫికెట్ల భద్రత, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.



# సముద్ర కెరటాలను జయించి ఒడ్డుకు చేరిన సాగర పుత్రులు

### 23 రోజుల ప్రాణసంకటం వీడింది

### పారాదీప్ తీరంలో ఓడలరేవు మత్స్యకారులు క్షేమం.. -కన్నీళ్లు తుడిచి ధైర్యం నింపిన శుభవార్త

### బాధిత కుటుంబాలకు సంపూర్ణ భరోసా కల్పిస్తామన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జీవీ రామచంద్రరావు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 26**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి వేటకు వెళ్లి సముద్రపు అలల మధ్య చిక్కుకుపోయిన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడటంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, మత్స్యకార నాయకుడు జీవీ రామచంద్రరావు తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. గత 23 రోజులుగా చావుబతుకుల మధ్య పోరాడుతూ కనిపించకుండా పోయిన మన మత్స్యకారులు చివరకు ఒడిశాలోని పారాదీప్ తీరానికి ప్రాణాలతో చేరుకున్నారని, ఈ వార్త బాధిత కుటుంబాలకే కాకుండా యావత్ మత్స్యకార సమాజానికి ఎంతో ఊరట కలిగించిందని ఆయన పేర్కొన్నారు. రాత్రింబవళ్లు కంటిమీద కునుకు లేకుండా, ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యుల వేదన తీరిపోయిందని జీవీ రామచంద్రరావు అన్నారు. ఒడిశా-బెంగాల్ సరిహద్దుల్లో లభ్యమైన మన జాలర్ల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, వారిని వీలైనంత త్వరగా అక్కడి నుంచి స్వగ్రామాలకు సురక్షితంగా తీసుకురావడానికి అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కష్టాల్లో ఉన్న ప్రతి మత్స్యకార కుటుంబానికి అండగా నిలవడమే తమ లక్ష్యమని, వారికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలను అందించడంలో వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.

# పెళ్లి సంబరాల్లో పెను విషాదం

### డివైడర్‌ను దాటి లారీని ఢీకొన్న కారు..-డ్రైవర్ అక్కడికక్కడే మృతి

### ఆనందపురం టోల్‌ప్లాజా సమీపంలో నిద్రమత్తు వల్లే ఘోర ప్రమాదం

### మరో ఐదుగురికి స్వల్ప గాయాలు..-దర్యాప్తు చేపట్టిన పోలీసులు





**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 26**

శుభకార్యానికి వెళ్తున్న ఓ కుటుంబంపై రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు పంజా విసిరింది. జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం బొడ్డవలస గ్రామానికి చెందిన కొందరు సింహాచలంలో జరగనున్న వివాహ వేడుకకు కారులో బయలుదేరారు. బుధవారం ఉదయం సుమారు 10:15 గంటల సమయంలో ఆనందపురం మండలం దుక్కవానిపాలెం టోల్ ప్లాజా సమీపానికి చేరుకోగానే, వాహనం నడుపుతున్న డ్రైవర్ కోన రవికిషోర్ (36) ఒక్కసారిగా నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో తీవ్ర వేగంతో ఉన్న కారు అదుపుతప్పి రహదారి డివైడర్‌ను బలంగా ఢీకొని, అవతలి వైపు నిలిపి ఉంచిన కంటైనర్ లారీని వేగంగా గుద్దుకుంది. ఈ భయానక ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయి డ్రైవర్ రవికిషోర్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వాహనంలో ప్రయాణిస్తున్న రౌతు వరలమ్మ, కోన వరలమ్మ, రౌతు దుర్గ, కురుముంజి వరలక్ష్మి, బంటుపల్లి లక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యలు చేపట్టగా, సమాచారం అందుకున్న ఆనందపురం పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి, ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు ముమ్మరం చేశారు.

## సేవా కార్యక్రమాల్లో 'మేము సైతం' ముందం

### నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక..

### వృద్ధులకు బియ్యం పంపిణీ



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 26:**

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే సంకల్పంతో 'మేము సైతం' సేవా సొసైటీ నిరంతరం కృషి చేస్తోందని సొసైటీ నూతన అధ్యక్షుడు అక్కిరెడ్డి పెంటయ్య పేర్కొన్నారు. ఆనందపురం మండలం రామవరంలో నిర్వహించిన కార్యక్రమంలో 20 మంది నిరుపేద వృద్ధులకు సొసైటీ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. సంస్థ విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అక్కిరెడ్డి పెంటయ్య, ఉపాధ్యక్షుడిగా నమ్మి అప్పలరాజు, కార్యదర్శిగా పి.కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా యర్ర వెంకట అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సొసైటీ ప్రతినిధులు ఘనంగా అభినందించారు. అనంతరం అధ్యక్షుడు అక్కిరెడ్డి పెంటయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. విశాఖపట్నం జిల్లా పరిధిలో అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన బాధితులకు, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు, అలాగే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద విద్యార్థులకు సొసైటీ తరఫున ఎల్లవేళలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సొసైటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## స్పెషల్ టెట్ నిబంధనల్లో మార్పులు చేయాలి

### డీఈఓకు 'ఆపస్' వినతి



**విశాఖపట్నం , సిటిజన్ టైమ్స్, ఆగష్టు 26**

స్పెషల్ టెట్ పరీక్ష నిర్వహణ నిబంధనల్లో తగిన మార్పులు చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) విశాఖ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జీటీవీ సుదర్శన్ పట్నాయక్ నేతృత్వంలో ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ అర్హత మార్కులను 60గా నిర్ణయించాలని, పేపర్-2 పరీక్షను ఉపాధ్యాయులు బోధించే సంబంధిత సబ్జెక్టులకే పరిమితం చేయాలని నాయకులు కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థుల సౌకర్యార్థం, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పరీక్షను ఆన్‌లైన్‌కు బదులుగా ఆఫ్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడేలా ఈ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. నారాయణరావు, జి.బి. శంకర్రావు, ఎం.జి.ఎస్. నారాయణరావు, ఎల్. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాజిపేట ఎస్ఐ పై వేధింపుల ఆరోపణలు

### పూర్తి విచారణకు ఆదేశం - నాగర్ కర్నూల్ సీఐకి బాధ్యతలు

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 26**

నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట ఎస్ఐ శ్రీనివాస్ రావుపై వేధింపులకు పాల్పడ్డారంటూ బాధితుడు మహేందర్ ఆరోపించాడు. ఒక మహిళకు సంబంధించిన కేసులో విచారణ పేరుతో తనను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వేధించారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. విచారణ సమయంలో తనపై మూత్రం పోశారని, దూషణలకు దిగారని పేర్కొంటూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బాధితుడు మహేందర్ డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఫిర్యాదు అందజేశాడు. దీనిపై స్పందించిన డీఎస్పీ వెంటనే ఎస్ఐపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. విచారణ బాధ్యతలను నాగర్‌కర్నూల్ సీఐ అశోక్ రెడ్డికి అప్పగించారు. విచారణ అనంతరం వాస్తవాలు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.



# సంక్షేమం, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం






**కృష్ణాజిల్లా : (సిటిజన్ టైమ్స్): ఆగస్టు 26**

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం సమీపంలో ఉన్నటువంటి పెడన నియోజకవర్గం , గూడూరు మండలం లో ఉన్నటువంటి గ్రామపంచాయతీలు రామానుజ వర్తనపల్లి, లేళ్ళ గరువు,ఆ గ్రామాల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు , బూత్ యూనిట్ ఇన్ ఛార్జ్ మట్టా శ్రీనివాసరావు, మండల నిర్వహణ కార్యదర్శి కుంభం నాగబాబు, జనసేన పార్టీ అధ్యక్షులు గడ్డి గోపుల వీర వెంకట నాగ ఆంజనేయులు,అదేవిధంగా గుడివాడ నియోజకవర్గం, గుడ్లవల్లేరు మండలం, వడ్లమన్నాడు గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పామర్తి సత్తిబాబు మాట్లాడుతూ ఆ గ్రామాలలోని సమస్యల గురించి వివరించారు. రామానుజ వర్తనపల్లి గ్రామంలో డ్రైనేజీ, త్రాగునీరు సమస్య ఉందని, వీధి దీపాలు, సిసి రోడ్లు బాగానే ఉన్నాయని టిడిపి బూత్ యూనిట్ ఇన్ ఛార్జ్ చెప్పారు. వేళ్ళ గరువు పంచాయితీలో సిసి రోడ్లు, వీధి దీపాలు, త్రాగునీరు బాగానే ఉన్నాయని, డ్రైనేజీ సమస్య ఉందని పెడన మండల టిడిపి నిర్వహణ కార్యదర్శి కె నాగబాబు, జనసేన పార్టీ అధ్యక్షులు జి వీర వెంకట నా గాంజనేయులు తెలిపారు. వడ్లమన్నాడు గ్రామంలో డ్రైనేజీ సమస్య ఉందని , త్రాగునీరు, సీసీ రోడ్లు, వీధి దీపాలు బాగానే ఉన్నాయని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పామర్తి సత్తిబాబు పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం కంటే కూ టమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒకవైపు అభివృద్ధి, మరోవైపు అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి కులం, మతం, భాష , పార్టీ బేధం లేకుండా సూపర్ సిక్స్ పథకాలు అందాయని స్పష్టం చేశారు. ఆ పంచాయతీలలో ఎంతమందికి పింఛన్లు ఇస్తున్నారో తెలిపారు. నిరుపేదలకు ఇళ్ళు,, కొత్త పెన్షన్లు గురించి అడుగుతున్నారని వెల్లడించారు. ఎప్పుడు జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించిన కూటమి ప్రభుత్వానికి తిరుగు లేదని ప్రజలు అంటున్నారని వ్యాఖ్యానించారు.పి - 4, ఇంటి పన్ను, జన గణన, సర్ సర్వే ఎంత శాతం పూర్తి అయ్యిందో కూడా చెప్పడం జరిగింది. శాసనసభ్యులు పెడన నియోజకవర్గం డైనమిక్ శాసనసభ్యులు కాగితపు కృష్ణ ప్రసాద్, గుడివాడ నియోజకవర్గం డైనమిక్ శాసనసభ్యులు వెనిగండ్ల రాము ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం ఒక కార్యకర్తల పని చేస్తున్నారని చెప్పారు.. పైన తెలిపిన సమస్యలకు ప్రభుత్వం గుర్తించి తక్షణమే పరిష్కారం చేయాలని ప్రజల కోరారని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని వాళ్లు వ్యక్తం చేశారు. ఇంటింట ప్రచారంలో భాగంగా కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించినటువంటి సూపర్ సిక్స్ పథకాలు గురించి వాళ్లకు వివరణ ప్రసంగించారు.

## పెట్రోల్ బంకును ప్రారంభించిన రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు సుగావాసి ప్రసాద్ బాబు.



**ఉమ్మడి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 26(సిటిజన్ టైమ్స్)**

గుర్రంకొండ మండలంలోని గాలివీడు రోడ్డు మార్గంలో ఆద్యశ్రీ భారత్ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు సుగావాసి ప్రసాద్ బాబు విచ్చేసారు. టిడిపి నాయకులు, జనసేన నాయకులు ప్రసాద్ బాబుకు ఘన స్వాగతం పలికారు. పెట్రోల్ బంక్ ను ప్రారంభించి బంక్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతగల పెట్రోల్, డీజిల్ ను వినియోగదారులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నక్కా సతీష్, శంకర, మౌలా,పి. భాస్కర్,జనసేన నాయకులు నక్కా గోపి, కూటమి నాయకులు బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి కరపత్రికలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 26(సిటిజన్ టైమ్స్)**

ఆచార్యప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో నేడు పలమనేరు నియోజకవర్గ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి వి.కోట మండలం రామాపురం గ్రామంలో సెప్టెంబర్ 4 నుండి సెప్టెంబర్ 12 తేదీ వరకు జరుగుతున్న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి కరపత్రాలను వారి చేతులమీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవాసమితి,వికోటశాఖ భక్తులు పాల్గొన్నారు.

## గంజాయి బెట్టింగ్ పై ఉక్కు పాదం ముమ్మిడివరం ఎస్సై శివకృష్ణ

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**



గంజాయి బెట్టింగ్ లపై ఉ ఉక్కు పాదం అమలు చేస్తామని ముమ్మిడివరం సబ్ ఇన్స్పెక్టర్ బి.శివ కృష్ణ అన్నారు. మండలంలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు, బెట్టింగ్ లావాదేవీలు, ఉంటే మండల ప్రజలు 1972 నెంబర్ కి కాల్ చేయాలని, లేదా పోలీస్ ఎమర్జెన్సీ నెంబర్ 112 కి ఫోన్ చేసి సహకరించాలని ప్రజలను కోరారు. మద్యం విషయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ అమలు చేస్తున్నామని ఎవరైనా, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే డ్రంక్ అండ్ డ్రైవ్ 35 కేసులు నమోదు చేసి 11 వేల రూపాయలు పైబడి కోర్టు ద్వారా జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, వీలైనంత మేరకు హెల్మెట్ ధరించాలని కోరారు. పలు గ్రామాలలో ఫ్లెక్సీలు వల్ల వర్గ వైశాల్యాలు ఎదురై లాండ్ ఆర్డర్ సమస్య ఉత్పన్నమవుతుందని, ఫ్లెక్సీలు నిరోధించాలని కోరారు. వ్యాపారాలు చేసుకునేవారు వాహనాల ట్రాఫిక్కు అంతరాయం కలవకుండా బోర్డులను రోడ్లపై ఉంచరాదని సూచించారు. ఇప్పటికే బెట్టింగ్, జూదాలు పై దృష్టి సారించి బెట్టింగ్, క్రీడలను నిలుపుదల చేసినట్టు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని సబ్ ఇన్స్పెక్టర్ శివకృష్ణ తెలియజేశారు.

## మీడియా అక్రిడిటేషన్లు -మార్పులు- రద్దులు

**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

కాకినాడ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు 2026-27 ద్వైవార్షిక కాలానికి సంబంధించిన మీడియా అక్రిడిటేషన్ కార్డుల్లో మార్పులు,సవరణలు లేదా రద్దులు కోరుకునే మీడియా సంస్థలు/ప్రతినిధులు తమ అభ్యర్థనలను ఆగస్టు 27-2026 లోపు సా.5 గం.ల లోపు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయం, కాకినాడ జిల్లా నందు సమర్పించవలసిందిగా తెలియజేయడమైనదని ఒక ప్రకటనలో తెలిపారు.

# ఏడుగురు మత్స్యకారులు క్షేమం

- పశ్చిమ బెంగాల్‌లో ఏడుగురూ సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ
- బోటు ఎలా తప్పిపోయింది? ఏ మార్గంలో వెళ్లింది? అన్ని కోణాల్లో పరిశీలన
- మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో కుటుంబాల్లో ఊరట
- మత్స్యకారుల భద్రతకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత
- మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి:(సిటిజన్ టైమ్స్):ఆగస్టు 26:**

కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ కావడం పట్ల వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న శుభవార్తతో వారి కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారని, వారిని త్వరగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ నెల 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బోటులో సముద్ర వేటకు వెళ్లారని మంత్రి తెలిపారు. నిర్ణీత సమయంలో బోటు తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా స్పందించి, మత్స్యకారుల ఆచూకీ కోసం ఎలాంటి ఆలస్యం చేయకుండా అన్ని విధాలుగా గాలింపు చర్యలు చేపట్టాలని ఆదేశించారని చెప్పారు. మత్స్యకారుల భద్రత విషయంలో ముఖ్యమంత్రి చూపిన ప్రత్యేక చొరవ, శ్రద్ధ అభినందనీయమని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని, నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ఆదేశించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తాను కూడా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ కేంద్ర అధికారులు, నేవీ, కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడినట్లు మంత్రి వెల్లడించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, బోటు ఎలా తప్పిపోయింది, ఏ మార్గంలో ప్రయాణించి ఉండవచ్చు, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉండే అవకాశం ఉందన్న అంశాలపై అన్ని కోణాల్లో పరిశీలన జరిపామని మంత్రి తెలిపారు. బోటులో సాంకేతిక సమస్య తలెత్తి ఉండే అవకాశం సహా ప్రతి అంశాన్ని నేవీ, కోస్ట్‌గార్డ్ అధికారులతో సమన్వయంతో పరిశీలించామని చెప్పారు. గాలి దిశ, వేగం, సముద్ర ప్రవాహాలు, బోటు డ్రిఫ్ట్ అయ్యే అవకాశం వంటి అంశాలను కూడా శాస్త్రీయంగా విశ్లేషించి, బోటు పశ్చిమ బెంగాల్ తీరం వైపు వెళ్లి ఉండవచ్చన్న అంచనాతో ఆ ప్రాంతంలోని కోస్ట్‌గార్డ్ యూనిట్లు, స్థానిక మత్స్యకారులను అప్రమత్తం చేశామని మంత్రి తెలిపారు. ఈ సమన్వయ కృషి ఫలితంగానే శంకర్‌పూర్ ఫిషింగ్ హార్బర్ సమీపంలో బోటును గుర్తించి, అందులోని ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించగలిగామని చెప్పారు. బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో మాట్లాడి ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్‌లో క్షేమంగా ఉన్న విషయాన్ని నిర్ధారించుకున్నామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం వారంతా ఆరోగ్యంగా ఉన్నారని, వారి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడించామని చెప్పారు. మత్స్యకారులను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

## పశ్చిమ బెంగాల్ తీరంలో 7గురు మత్స్యకారులు సురక్షితం

### మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**



కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. మత్స్యకారుల క్షేమ సమాచారం తెలియడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ నెల 3వ తేదీన ఓడలరేవు నుంచి సముద్ర వేటకు వెళ్లిన ఏడుగురు మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటులో సాంకేతిక సమస్య తలెత్తడంతో పశ్చిమ బెంగాల్ తీరానికి చేరుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ కోసం జిల్లా యంత్రాంగం, మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టగా, వారు అక్కడ క్షేమంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. బోటు యజమాని సోదరుడు భవానీ ప్రసాద్‌తో అధికారులు మాట్లాడి మత్స్యకారుల వివరాలను నిర్ధారించినట్లు తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన సమన్వయ చర్యలతో వారి క్షేమ సమాచారాన్ని తెలుసుకోగలిగామని కలెక్టర్ పేర్కొన్నారు. మత్స్యకారులను పశ్చిమ బెంగాల్ నుంచి స్వస్థలానికి సురక్షితంగా తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమానికి జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. మత్స్యకారులు స్వస్థలానికి చేరుకునే వరకు అవసరమైన అన్ని చర్యలను పర్యవేక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## మరోసారి దాతృత్వం చాటుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

### పేద విద్యార్థిని ఉన్నత చదువుకు రూ.32,000 చెక్కు అందజేత



**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 26**

మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి. పేద విద్యార్థిని ఉన్నత చదువుకు అండగా నిలిచారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన పేదింటి దళిత బిడ్డ కొంగరి గౌరమ్మ, బాలస్వామి దంపతుల కుమార్తె రేవతి బీపీఈడీ కోర్సులో సీటు సాధించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫీజు చెల్లించడం కష్టంగా మారడంతో విషయం మాజీ ఎమ్మెల్యే దృష్టికి వెళ్లింది. స్పందించిన మర్రి జనార్దన్ రెడ్డి తన సొంత నిధుల నుంచి మొదటి సంవత్సరం ఫీజు రూ.32,000 చెక్కును అందజేసి అండగా నిలిచారు. కోర్సు పూర్తయ్యే వరకు అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం ఏ విద్యార్థి కలలకు అడ్డంకి కాకూడదని, చదువుకోవాలనే తపన ఉన్న ప్రతి పేద విద్యార్థికి తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. రేవతి కోర్సును విజయవంతంగా పూర్తి చేసి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. తమ కుమార్తె చదువుకు అండగా నిలిచిన మర్రి జనార్దన్ రెడ్డికి విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## రహదారి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే



**గన్నవరం: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 26:**

గన్నవరం--పుట్టగుంట ప్రధాన రహదారి నిర్మాణాన్ని మరో మూడు వారాల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. దావాజీగూడెం రహదారి పనుల పురోగతిపై గన్నవరం కార్యాలయంలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లను అత్యవసరంగా పక్కకు మార్చాలని విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తారు ధరలు భారీగా పెరగడంతో రహదారి అంచనా వ్యయం పెరిగిందని, సవరించిన అంచనాలకు పరిపాలనా ఆమోదం పొందే ప్రక్రియ కారణంగానే పనులు ఆలస్యమైనట్లు ఎమ్మెల్యేకు వివరించారు. అయితే ఆ కారణాలు ఇకపై పనులకు అడ్డంకి కాకూడదని, మూడు వారాల్లో పనులు పూర్తిచేసి ప్రజలకు రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని యార్లగడ్డ ఆదేశించారు. ఈ రహదారి పూర్తయితే ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని ఆయన తెలిపారు. గన్నవరం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు.

# గ్రామీణ రోడ్ల కల్పనే లక్ష్యం

## పలు రోడ్లకు శంకుస్థాపన -ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

**రాజోలు సిటిజన్ టైమ్స్, ఆగస్టు 26**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.12.17 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 10 రోడ్డు అభివృద్ధి పనులకు శాసన సభ్యులు దేవ వరప్రసాద్ పలు శంకుస్థాపనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, ప్రజలకు సురక్షితమైన రహదారి సౌకర్యం కల్పించడం లక్ష్యంగా ఈ పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ తెలిపారు. వి.వి.మెరక ఆర్ అండ్ బి రోడ్డు నుంచి చావిడి పిల్లి వారి గ్రూప్ వరకు 2.273 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.25 కోట్లతో శంకుస్థాపన, మోరిపోడు, బట్టేలంక, చింతలమోరి, గొంది ఆర్ అండ్ బి రోడ్డు నుంచి మోరిపోడు మీదుగా బట్టేలంక లిమిట్స్ వరకు 1.911 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.05 కోట్లతో శంకుస్థాపన, శృంగవరప్పాడు గ్రామంలో మలికిపురం, కేశవదాసుపాలెం ఆర్‌డబి రోడ్డు నుంచి దొండపాటి వారి గ్రూప్ వరకు 1.410 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.30 కోట్లతో శంకుస్థాపన, అంతర్వేదికర సడక్ రోడ్డు నుంచి జిల్లా పరిషత్ హైస్కూల్ మీదుగా బీచ్ వరకు 2.10 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.73



కోట్లతో శంకుస్థాపన, అంతర్వేది ఆర్‌డబి రోడ్డు నుంచి అంతర్వేదికర నల్లా వారి గ్రూప్ వరకు 2.10 కి.మీ. మేర నిర్మించనున్న బీటీ రోడ్డుకు రూ.1.62 కోట్లతో శంకుస్థాపన, రామేశ్వరం జిల్లా పరిషత్ రోడ్డు నుంచి బళ్ల శ్రీరాములు ఇంటి మీదుగా గుడిమూల గోదావరి రేవు రోడ్డు వరకు 1.440 కి.మీ. మేర నిర్మించనున్న రహదారికి రూ.1.08 కోట్లతో శంకుస్థాపన, సఖినేటిపల్లిలంక కేఎన్ఎఫ్ రోడ్డు నుంచి చింతా వారి పేట సీసీ రోడ్డు వరకు 0.900 కి.మీ. మేర నిర్మించనున్న రహదారికి రూ.39 లక్షలతో శంకుస్థాపన,అప్పనరామునిలంక ఆర్ అండ్ అండ్ బి రోడ్డు నుంచి కొత్తలంక హరిజనవాడ వరకు 2.131 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.17 కోట్లతో శంకుస్థాపన, అప్పనరామునిలంక గ్రామంలో రావూరి వారి మెరక, గ్రామ పంచాయతీ కార్యాలయం మీదుగా ఆర్‌డబి రోడ్డు నుంచి ఆర్‌డబి రోడ్డు వరకు 1.300 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.04 కోట్లతో శంకుస్థాపన, అంతర్వేదిపాలెం గ్రామంలో కేఎన్ఎఫ్ రోడ్డు నుంచి మోరి, గొంది ఆర్‌డబి రోడ్డు వరకు, అంతర్వేదిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ మీదుగా 2.112 కి.మీ. మేర నిర్మించనున్న సీసీ రోడ్డుకు రూ.1.54 కోట్లతో శంకుస్థాపనలలో పాల్గొన్నారు. రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే దేవ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాష్ట్ర బి సి కోఆపరేటివ్ ఫైనాన్స్ డైరెక్టర్ గుబ్బల ఫణి కుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, పిఏసీస్ ఛైర్మెన్ రావూరి సూర్యనారాయణ,మాజీ సర్పంచ్ లు సుబ్బరాజు, బర్రె శ్రీను, బిజెపి నేత మాలే శ్రీనివాస్ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భక్తిరస కీర్తన ఆడియో క్యాసెట్ ఆవిష్కరణ



**ఒంగోలు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

శ్రీ అంకమ్మతల్లి ఆశీస్సులతో 'లీలా మణికంఠ బృందం'బాలు గురుస్వామి ఆధ్వర్యంలో రూపొందించిన 'భక్తిరస కీర్తనల' ఆడియో క్యాసెట్ ను డప్పు శీను గురుస్వామి ఆవిష్కరించారు. బుధవారం ఒంగోలులోని సంతపేటలో గల శివం ఫౌండేషన్ వేదికగా ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గాయకులు గజ్జలకొండ బాలకృష్ణ గురుస్వామి (బాలు) భక్తిరస కీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డప్పు శీను గురుస్వామితో పాటు ఒంగోలు మునిసిపల్ మాజీ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఒంగోలు ఏఎంసి మాజీ చైర్మన్ మారెళ్ళ వివేకానంద, సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ, జిపిఎస్ ఫౌండేషన్ చైర్మన్ రాయపాటి అంకయ్య, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు, శివం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొల్లపూడి శ్రీహరి, 'మేము సైతం' ఫౌండేషన్ చైర్మన్ జనసేవ శ్రీనివాసరావు నూతనంగా రూపొందించిన 15 భక్తి పాటల ఆడియో క్యాసెట్‌ను ఆవిష్కరించారు. సుమారు 200 మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డప్పు శ్రీను బృందం, కుమారస్వామి గాయకులు, గజ్జలకొండ నారాయణ వెంకటేశ్వర్లు, కొండలు స్వామి, సూదనగుంట కోటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, ఒంగోలు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో వైభవంగా శ్రీవారి ఆస్థానం

### - శాస్త్రోక్తంగా శ్రవణా నక్షత్ర పూజలు



**ఒంగోలు సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధ వారం సాయంత్రం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం.. చతుర్వేద పారాయణ.. విష్ణు సహస్ర నామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను పద్యాలను గానం చేసారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, శ్రీ గిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి మాట్లాడుతూ ఆగస్టు 27 నుండి 29 వ తేదీ వరకు జరిగే శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

## బొడ్డువానిపాలెం వద్ద రోడ్డు ప్రమాదం.. ఒకరి మృతి



**అద్దంకి, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

కోరిశపాడు మండలం, మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడ్డువానిపాలెం గ్రామ సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు దాటుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తిని వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మేదరమెట్ల ఎస్.ఐ రమేష్ బాబు వెల్లడించారు. ?జాతీయ రహదారిపై ఆ గుర్తుతెలియని వ్యక్తి రోడ్డు దాటుతున్న క్రమంలో, ఒంగోలు వైపు వేగంగా వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా అతడిని ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు తీవ్ర గాయాలపాలైన ఆ వ్యక్తి ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు నిర్ధారించారు. స్థానికుల సమాచారంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ రమేష్ బాబు తెలిపారు.

# ఎయిడ్స్ టిబి నియంత్రణపై ప్రచారం

### ప్రేమనందం బుర్ర కదా టీం చే జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ అమలాపురం వారిచే హెచ్ ఐ వి ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం



**అంబాజీపేట/ పి గన్నవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, దిశా జనకళ్యాణ్, లింక్ వర్కర్స్ చేంజెస్ స్వచ్ఛంద సంస్థ ల ఆధ్వర్యంలో అంబాజీపేట మార్కెట్, పి.గన్నవరం బస్టాండ్ సెంటర్ ల లో ప్రేమానందం బుర్ర కదా టీం చే,ఇంటెన్సిఫైడ్ ఐ ఈ సి కాంపెయిన్ లో భాగంగా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై, టీబీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమములో భాగముగా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజములో కలిసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి,కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ ఏఆర్టి మందులు ,టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ ,అలానే చెడు వ్యసనాలకు, డ్రగ్స్ వాడటం వల్ల కలిగే నష్టాలు చెబుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ సిబ్బంది హెచ్ ఎస్ ఎస్ రాధా నరసింహం, ఆశ వర్కర్స్ జి. ఏల్ నరణమ్మ, ఎస్ రత్నకుమారి, జనకళ్యాణ్ టి ఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శ్రీను సంస్థ సిబ్బంది ఏం వి. జ్యోతి లింక్ వర్కర్ సిబ్బంది కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ సిబ్బంది మొదలగు వారు పాల్గొనటం జరిగింది.

## మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయం...

### కమ్మిరెడ్డి పాలెం మసీదులో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

పేదవారికి సాయం చేయడం ద్వారా అల్లా అనుగ్రహం పొందవచ్చని, ప్రేమ, సోదర భావం, ధర్మచింతన ప్రతీ మానవునిలోనూ ఉండాలని చెప్పిన మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో జరిగిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్య ఖురాన్ బోధనలతో మానవాళిని ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్తని కొనియాడారు.సమాజాన్ని హింస, ద్వేషాల నుంచి విముక్తి చేసి శాంతివైపు నడిపించిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జన్మదినమే మిలాద్ - ఉన్ - నబీ గా ముస్లిం సోదర సోదరీమణులు జరుపుకుంటారన్నారు. వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

## రహదారి ప్రమాదం పై కేసు నమోదు..

**సంతమాగులూరు, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

ఈనెల 15వ తేదీన మండలంలోని కొప్పెరపాడు వద్ద జరిగిన రహదారి ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలియజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. వివరాల్లోకెళ్తే దైవ దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో తమ గ్రామం వద్ద తాము వెళ్ళిన వాహనంలో నుండి దిగుతున్న మహిళలను,వెనుక వైపు నుండి ఆటో వేగంగా ఢీకొట్టడంతో ఏడుగురు మహిళలు గాయపడ్డారు. కొప్పెరపాడు, కూకట్లపల్లి గ్రామాలకు చెందిన భక్తులు గుణదలలోని మేరీమాత దర్శనానికి వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి తాము వెళ్లిన డీసీఎం వాహనంలో నుండి కొప్పెరపాడు వద్ద కిందకు దిగుతున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది.

# జిల్లా టిడిపి కార్యవర్గ సమావేశం

### పార్టీ బలోపేతానికి కృషి -జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తులు సాయి

**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

జిల్లా పార్టీ కార్యవర్గ సమావేశం ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.పార్టీ ఆదేశాల మేరకు అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి ఇద్దరు జోడి సమన్వయంతో సభ్యుల సూచనలు మేరకు పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు, ఈ పార్టీకి ఉన్నంత విశిష్టత ఏ పార్టీకి ఉండదు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు చేసుకుంటూ వస్తున్నాం అని గత ప్రభుత్వంలో సంక్షేమం అనేదే కనబడలేదు ఈ ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండు చేసుకుంటూ వస్తున్నాం, యువ నాయకులు లోకేష్ ఆధ్వర్యంలో ఆయనకు వెన్ను దండుగా పవన్ కళ్యాణ్ పార్టీని ముందుకు నడిపిస్తూ కూటమి ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారని గుత్తుల సాయి అన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహ రావు, దొమ్మేటి రమణ కుమార్,



నేదునూరి వీర్రాజు ,దేవు శ్రీను జిల్లా అధికార ప్రతినిధి, గుబ్బల నాగేశ్వరరావు, మల్లాడి వెంకటరమణ, దేవు వెంకటరాజు, చిర్రా సురేష్, దాట్ల బాబు,ఏళ్ల ఉదయ్, రెడ్డి సుబ్బారావు,పులివెల ప్రకాష్, నిమ్మకాయల రాజా, నారాయణమూర్తి, చుట్టుగుళ్ల దుర్గ వతి కిషోర్, గొల్లపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు..

# ఉత్కంఠకు తెర.. 23 రోజుల తర్వాత క్షేమంగా లభ్యమైన ఏడుగురు మత్స్యకారులు ఆచూకీ

### ఆనందం వ్యక్తం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్


**రామచంద్రపురం/ అమరావతి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 26**

అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం అందడంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లవరం మండలం ఓడలరేవు నుంచి ఈ నెల 3వ తేదీన వేటకు వెళ్లి గల్లంతైన బోటు ఆచూకీ లభించడంతో పాటు, అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడిశాలోని పారాదీప్ తీరానికి చేరుకున్నారని అధికారులు ధృవీకరించినట్లు మంత్రి తెలిపారు. గత 23 రోజులుగా మత్స్యకారుల ఆచూకీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. గల్లంతైన మత్స్యకారుల క్షేమ సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యుల్లో



ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఈ ఘటనపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ పరిస్థితిని సమీక్షించారని మంత్రి సుభాష్ వెల్లడించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యల్లో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. బెంగాల్--ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మత్స్యకారుల ఆచూకీ లభించిందని, ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని సమాచారం అందిన వెంటనే వారిని స్వస్థలాలకు తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైతే అధికారుల బృందాన్ని పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు పంపించి మత్స్యకారులను సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం మాకు ఎంతో ఊరటనిచ్చింది. గత 23 రోజులుగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు ఇది సంతోషకరమైన వార్త. ప్రభుత్వం వారి వెంటే నిలబడి, వారిని త్వరితగతిన స్వస్థలాలకు తీసుకువచ్చే బాధ్యతను నిర్వర్తిస్తుంది అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

# తెర వెనుక కష్టానికి గాయాలే సాక్ష్యం!



డియోర్ షూస్ మరియు హౌస్ ఆఫ్ CB డ్రెస్‌లో అదితి బుధతోకి అభిమానులను ఆశ్చర్యపరిచింది







రెయిన్‌బో హార్ట్ మరియు సాల్టీ హెయిర్‌తో కృతి సనన్ వైబ్రెంట్ వెకేషన్ వైబ్స్

సినిమా రంగంలో తెరపై కనిపించే నటీనటుల మెరుపులు, గ్లామర్ వెనుక ఎన్నో కఠిన శ్రమ, ప్రాణాలను పణంగా పెట్టే సాహసాలు దాగి ఉంటాయి. ఇటీవల కాలంలో బాలీవుడ్ .. సౌత్ చిత్ర పరిశ్రమలకు చెందిన పలువురు ప్రముఖ నటీనటులు షూటింగ్‌ల సమయంలో తీవ్రమైన గాయాల బారిన పడుతున్నారు. కార్తీక్ ఆర్యన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న, నిమ్రత్ కౌర్ అహ్లువాలియా వంటి స్టార్లు వరుసగా ఇంజూరీస్ ఎదుర్కొంటున్న ఘటనలు చర్చనీ యాంశంగా మారుతున్నాయి.

యువ హీరో కార్తీక్ ఆర్యన్ నెక్స్ట్ ప్రాజెక్ట్ షూటింగ్‌లో భాగంగా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొంటుండగా గాయపడ్డారు. ప్రమాదకరమైన విన్సెంట్లు .. స్టంట్స్ చేసే సమయంలో ఆయనకు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. అయి నప్పటికీ అంకితభావంతో షూటింగ్‌ను కొనసాగించిన కార్తీక్ తెగువను అభిమానులు ప్రశంసిస్తున్నారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా మాస్ యాక్షన్ సినిమాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో ఈ తరహా గాయాలు సర్వ సాధారణంగా మారుతున్నాయి.మరోవైపు బిజీ షెడ్యూల్స్ మధ్య శ్రమిస్తున్న నటి రష్మిక మందన్న కూడా ఇటీవల షూటింగ్‌లో గాయపడ్డారు.

నిరంతర ప్రయాణాలు, భారీ బడ్జెట్ చిత్రాల షూటింగ్‌లతో తీరికలేకుండా గడుపుతున్న భామ శారీరక ఒత్తిడి , రిస్కీ సీన్ల కారణంగా స్వల్ప గాయాలను ఎదుర్కొన్నారు. ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా సినిమా కోసం పడుతున్న కష్టాన్ని చూసి అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.టెలివిజన్ నుంచి సినిమాలకు ఎదిగిన నిమ్రత్ కౌర్ అహ్లువాలియా వంటి నటీమణులు కూడా ఇటీవల ఫిట్‌నెస్ సెషన్స్ .. షూటింగ్ స్పాట్లలో గాయాలపాలయ్యారు.ఈ ఘటనలన్నీ సెలబ్రిటీల దైనందిన జీవితంలో ఫిట్‌నెస్, యాక్షన్ ఎంతటి రిస్క్‌తో కూడుకున్నవో తెలియజేస్తున్నాయి. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచే స్టార్లు తెరవెనుక పడుతున్న శ్రమకు ఈ గాయాలే ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇండస్ట్రీలో హై-ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్‌లకు మారుతున్న ట్రెండ్, విజువల్ వండర్స్ కోసం మేకర్స్ చేస్తున్న ప్రయత్నాలు నటీనటుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. బాడీ డబుల్స్ కాకుండా నటీనటులే స్వయంగా సాహసాలు చేయడానికి ముందుకు రావడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. అయితే దర్శక నిర్మాతలు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నా? చిన్న పాటి తప్పిదాలు కారణంగా గాయాలు తప్పడం లేదు.

గ్లామర్ ప్రపంచం వెనుక కష్టాల గురించి వరుస గాయాలు మరోసారి కళ్లకు కడుతున్నాయి. ఎన్నో ఇబ్బందులను, నొప్పులను భరించి ప్రేక్షకుల ముందుకు వచ్చి అలరిస్తున్న నటీనటుల నిబద్ధతను అంతా అభినందించాల్సిం దే. గాయాల నుంచి కోలుకుని మరింత ఉత్సాహంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి నటీనటులు అంతే ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




# అదిగో విజయం..

## గెలుపు బాటలో భారత్
## శ్రీలంకతో రెండో టెస్టు

వరుణుడు అడ్డుపడుతున్నా.. శ్రీలంక పోరాడుతున్నా.. భారత్ మాత్రం తగ్గట్లేదు.. కొలంబో టెస్టుపై ఆధిపత్యం చెలాయిస్తున్న శుభ్‌మన్ సేన విజయంపై ఓ చేయివేసింది.. ఇంకో నాలుగు వికెట్లు త్వరగా పడగొట్టి.. కొద్దిపాటి లక్ష్యాన్ని ఛేదించేస్తే చాలు! ఫాలోఆన్‌లో పడ్డ శ్రీలంక.. బౌలర్లను ప్రతిఘటించి అటను అయిదో రోజుకు తీసుకెళ్లింది. ప్రస్తుతం ఆ జట్టు ఆధిక్యం 16 పరుగులు మాత్రమే. ఆతిథ్య శ్రీలంక ప్రతిఘటించినప్పటికీ చివరిదైన రెండో టెస్టులో టీమ్‌ఇండియా విజయానికి మరింత చేరువైంది. ఓవర్‌నైట్ స్కోరు 265/8తో నాలుగో రోజు, బుధవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక.. ఎంతోసేపు నిలవలేదు. మరో 25 పరుగులు జోడించి 290 పరుగులకు ఆలౌటై, ఫాలోఆన్‌లో పడింది. 85తో బ్యాటింగ్ కొనసాగించిన సోనాల్ దినుష (103; 162 బంతుల్లో 8ఐ4, 3ఐ6) సెంచరీ పూర్తి చేశాడు. అరంగేట్ర ఆటగాడు సారాంశ్ జైన్.. లంక చివరి రెండు వికెట్లు పడగొట్టాడు. 213 పరుగుల లోటుతో ఫాల్‌ఆన్ ఆరంభించిన ఆతిథ్య జట్టు.. 6 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సత్తా చాటిన సూర్యబండార (92; 173 బంతుల్లో 10ఐ4, 1ఐ6) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కమిందు మెండిస్ (55; 92 బంతుల్లో 2ఐ4, 3ఐ6)తో అతడి భాగస్వామ్యమే మ్యాచ్‌ను ఆఖరి రోజుకు తీసుకెళ్లింది. మానవ్ సుతార్ రెండు వికెట్లు పడగొట్టాడు. ప్రసిద్ధ్, సిరాజ్, సారాంశ్ జైన్, జడేజా తలో వికెట్ చేజిక్కించుకున్నారు. దినుష (7)తో పాటు నువంత (3) క్రీజులో ఉన్నాడు. విజయం దాదాపుగా ఖాయమైన టీమ్‌ఇండియా.. అయిదో రోజు ఎంత త్వరగా లంక ఇన్నింగ్స్‌ను ముగిస్తుందన్నదే ఆసక్తికరం. వరుణుడు మ్యాచ్‌ను అడ్డుకోకుండా.. లంక ఓటమిని తప్పించుకుంటే అద్భుతమే.

**సూర్యబండార 92**

లంక పోరాటం: శ్రీలంక ఇంకా మ్యాచ్‌లో నిలిచింది అంటే ప్రధాన కారణం పసిందు సూర్యబండార పోరాటమే. కెరీర్‌లో రెండో టెస్టే ఆడుతున్నా.. మరోసారి అదిరే ప్రదర్శన చేశాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. కానీ గట్టి ప్రతిఘటన అనంతరం పుంజుకున్న భారత బౌలర్లు.. చకచకా వికెట్లు పడగొట్టి లంకను దెబ్బతీశారు. ఫాలోఆన్ తప్పించుకోలేకపోయిన శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌ను కూడా పేలవంగా ఆరంభించింది. ఓపెనర్ ఉదార (3)ను ఔట్ చేయడం ద్వారా నాలుగో ఓవర్లోనే ఆ జట్టును సిరాజ్ దెబ్బతీశాడు. కానీ సూర్యబండార క్రీజులో పాతుకుపోయాడు. లంకను చుట్టేయాలని చూసిన భారత్ ప్రయత్నాలను అడ్డుకున్నాడు. మొదట కమిల్ మిషార (32)తో 58 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దాడు. మిషారను జడేజా వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాక కమిందు మెండిస్‌తో కలిసి సూర్యబండార అదిరే భాగస్వామ్యాన్ని నెలకొల్పి, భారత బౌలర్లను తీవ్ర అసహనానికి గురిచేశాడు. ఈ జంట 115 పరుగులు జోడించింది. సాధికారికంగా ఆడిన ఈ జోడీ బౌలర్లపై ఎదురుదాడి చేయడానికి వెనుకాడలేదు. స్పిన్నర్లను సూర్యబండార అలవోకగా స్వీప్ చేశాడు. మానవ్ సుతార్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. అతడి బౌలింగ్‌లో ముందుకొచ్చి షాట్లు ఆడాడు. సుతార్ బౌలింగ్‌లో మెండిస్ రెండు సిక్స్‌లు బాదాడు. అతణ్ని కుదురుకోనివ్వలేదు. సుతార్ బౌలింగ్‌లోనే సూర్యబండార స్లాగ్ స్వీప్‌తో సిక్స్ బాదేశాడు. సూర్యబండార 78 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేయగా.. మెండిస్ 87 బంతుల్లో అక్కడికి చేరుకున్నాడు. టీకి కొద్దిసేపు ముందు మెండిస్‌ను ప్రసిద్ధ్ ఔట్ చేయడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది. అతడు షార్ట్ బంతిని ఆడగా.. గాల్లోకి లేచిన బంతిని గిల్ పరుగెత్తుతూ చక్కగా అందుకున్నాడు. అప్పటికి లంక స్కోరు 178. కానీ సూర్యబండార పోరాటాన్ని కొనసాగించాడు. కెప్టెన్ ధనంజయ (23; 44 బంతుల్లో 1ఐ4, 1ఐ6)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. టీ సమయానికి లంక 199/3తో నిలిచింది. చాలా మెరుగ్గా కనిపించింది. భారత్‌కు కంగారు తప్పలేదు. చకచకా మూడు వికెట్లు: ఆఖరి సెషన్లో టీమ్‌ఇండియా బంతితో పుంజుకుంది. చకచకా మూడు వికెట్లు పడగొట్టి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసింది. లంక ఆశలపై నీళ్లు చల్లుతూ మ్యాచ్‌పై గట్టిగా పట్టుబిగించింది. నిలదొక్కుకున్న బ్యాటర్లిద్దరినీ మానవ్ సుతార్ ఔట్ చేశాడు. లంక స్కోరు 209 వద్ద ధనంజయ వెనుదిరిగాడు. అతడు ఇన్‌సైడ్ ఎడ్జ్‌తో స్లిప్‌లో పడిక్కల్‌కు దొరికిపోయాడు. తన తొలి టెస్టు శతకం చేసేలా కనిపించిన సూర్యబండార.. సుతార్ తర్వాతి ఓవర్లో బోల్తా కొట్టాడు. అప్పటిదాకా ఎంతో సంయమనంతో ఆడిన అతడు.. ముందుకొచ్చి, భారీ షాట్ ఆడబోయాడు. అది గమనించిన సుతార్ బంతిని దూరంగా వేశాడు. సూర్యబండార పూర్తిగా గతి తప్పగా.. పంత్ అతణ్ని స్టంపౌట్ చేశాడు. కాసేపటి తర్వాత డిక్వెలా (6)ను సారాంశ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో శ్రీలంక 218/6తో నిలిచింది. ఆ జట్టు 9 పరుగుల వ్యవధిలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దినుష, నువంత మరో వికెట్ పడనివ్వలేదు. వర్షం, వెలుతురులేని కారణంగా మ్యాచ్ ముందే ముగిసింది.

# సెమీస్‌లో ఆంద్రీవా, స్వితోలినా జోడీలు

## అల్కరాస్- సెరెనా ద్వయం ఓటమి -యుఎస్ ఓపెన్

యుఎస్ ఓపెన్‌లో ఎలీనా స్వితోలినా- గేల్ మోన్‌ఫిల్స్ దంపతులు అదరగొడుతున్నారు. వీళ్లు మిక్స్‌డ్ డబుల్స్‌లో సెమీఫైనల్ చేరుకున్నారు. బుధవారం క్వార్టర్స్‌లో స్వితోలినా, మోన్‌ఫిల్స్ జంట 5-4, 4-5, 10-8తో కేథరినా సినియాకోవా, హెన్రీ ప్యాటెన్ ద్వయంపై నెగ్గింది. సెమీస్‌లో ఈ జంట బెలిండా బెన్సిచ్, ఫ్లావియో కొబొలి జోడీని ఢీకొంటుంది. మొదట చెరో సెట్ నెగ్గడంతో మ్యాచ్ టైబ్రేక్‌కు మళ్లింది. మరో క్వార్టర్స్‌లో మిరా ఆంద్రీవా, ఆంద్రి రుబ్లెవ్ ద్వయం కూడా టైబ్రేక్‌లోనే గెలిచింది. ఈ జంట 4-1, 4-5, 10-5తో దయానా ష్నైడర్, కాస్పర్ రూడ్ జోడీపై పైచేయి సాధించింది. ఈ జోడీ సెమీస్ పోరులో కరోలినా ముచోవా, జాకబ్ మెన్సిక్ జంటతో తలపడనుంది. సెరెనా విలియమ్స్, అల్కరాస్ జోడీకి నిరాశ ఎదురైంది. క్వార్టర్స్‌లో ఈ జంట 4-5, 1-4తో బెన్సిచ్, కొబొలి ద్వయానికి తలొంచింది.

డబుల్స్‌లో విలియమ్స్ సిస్టర్స్: యుఎస్ ఓపెన్ మహిళల డబుల్స్‌లో విలియమ్స్ సిస్టర్స్ బరిలో దిగనున్నారు. వీనస్, సెరెనా జోడీకి వైల్డ్‌కార్డు లభించింది. ఈ ద్వయం 1999, 2009లో యుఎస్ ఓపెన్ డబుల్స్ టైటిళ్లు కైవసం చేసుకుంది. మెరిసిన ఫెదరర్, మెకన్రో: దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెదరర్ యుఎస్ ఓపెన్ జరుగుతున్న ఆర్థర్ ఆష్ స్టేడియంకు వచ్చాడు. ఈ స్విట్జర్లాండ్ స్టార్ ఆడీ రాడిక్‌తో ఓ స్నేహపూర్వక మ్యాచ్ ఆడి ప్రేక్షకుల్ని అలరించాడు. ఒకే సెట్‌గా జరిగిన ఈ సింగిల్స్ పోరులో ఫెదరర్ 6-3తో రాడిక్‌ను ఓడించాడు. అనంతరం జాన్ మెకన్రోతో కలిసి డబుల్స్ గేమ్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో ఫెదరర్ ద్వయం 7-5తో రాడిక్, ఆంద్రీ అగాసి జోడీపై విజయం సాధించింది.



Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776